సాక్షి
మంచిర్యాల
సోమవారం । 29 । జనవరి । 2024



జంగుబాయి క్షేత్రం.. జనసందోహం

జంగుబాయి జాతరకు ఆదివారం భక్తులు పోటెత్తారు. మహారాష్ట్ర, కర్ణాటక, ఒడిశా, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి భక్తులు తరలివస్తున్నారు. 8లో▸



'మెస్రం' తిరుగు పయనం

నాగోబా జాతర కోసం గోదావరి జలాలను తీసుకువెళ్లేందుకు పాదయాత్రగా బయల్దేరిన మెస్రం వంశీయులు ఆదివారం జన్నారం మండలం కలమడుగుకు చేరుకున్నారు. 10లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
31.1 /17.3

ఆకాశం కొంతమేర మేఘావృతమవుతుంది. రాత్రి ఉష్ణోగ్రతలు తగ్గుతాయి. మంచు కురుస్తుంది. చలి ప్రభావం కొనసాగుతుంది.

న్యూస్‌రీల్

మంత్రులను కలిసిన సర్పంచులు



మంత్రి పొంగులేటితో రజనీ, భూమన్నయాదవ్

దండేపల్లి: ఫిబ్రవరి 1తో సర్పంచుల పదవీకాలం ముగుస్తున్నందున, ఎన్నికలు నిర్వహించే వరకూ పదవీకాలం పొడిగించాలని సర్పంచుల ఫోరం జిల్లా ప్రధాన కార్యదర్శి గడికొప్పుల రజనీ, సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు భూమన్నయాదవ్ కోరారు. ఈమేరకు హైదరాబాద్‌లో ఆదివారం మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని కలిసి విన్నవించారు.

వన్యప్రాణులను వేటాడితే కఠిన చర్యలు



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎఫ్ఆర్వో

కోటపల్లి: వన్యప్రాణులను వేటాడితే కఠిన చర్యలు తీసుకుంటామని కోటపల్లి ఎఫ్ఆర్వో రవి హెచ్చరించారు. సర్వాయిపేట, నాగంపేట, కొండంపేట, జనగామ, ఎర్రాయిపేట గ్రామాలను ఆదివారం సందర్శించారు. గతంలో వేటాడిన వేటగాళ్ల, గ్రామస్తులకు వన్యప్రాణుల సంరక్షణ, చట్టాలపై అవగాహన కల్పించారు. అటవీ జంతువుల కోసం విద్యుత్ తీగలను అమర్చడం అమర్చడం నేరమన్నారు. వేటగాళ్లపై నిఘా ఉంచామని తెలిపారు. వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత అన్నారు. ఆయన వెంట ఎఫ్‌బీవో సాగర్, సత్యనారాయణ, నరేశ్, నదీమొద్దీన్, ప్రసన్నరాణి, లత పాల్గొన్నారు.

జైభీమ్ సైనిక్‌దళ్ జిల్లా అధ్యక్షుడిగా నరేశ్



నియామక పత్రం అందిస్తున్న నాయకులు

పాతమంచిర్యాల: జైభీమ్ సైనిక్ దళ్ జిల్లా అధ్యక్షుడిగా మంచిర్యాల పట్టణానికి చెందిన ఎర్రోళ్ల నరేశ్ నియమితులయ్యారు. రాష్ట్ర అధ్యక్షుడు ఆసాది పురుషోత్తం జిల్లా కేంద్రంలో ఆదివారం నియామక పత్రం అందించారు. ఈ సందర్భంగా నరేశ్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీల సంక్షేమం, హక్కుల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో తెలంగాణ మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు గజెల్లి లక్ష్మణ్, రాష్ట్ర అధికార ప్రతినిధి పైడిమళ్ల నర్సింగ్ తదితరులు పాల్గొన్నారు.


పరిమితికి మించి ఇసుక తరలించొద్దు



వే బిల్లు పరిశీలిస్తున్న ప్రాజెక్టు అధికారి

కోటపల్లి: ఇసుక క్వారీల నుంచి రవాణా అవుతున్న ఇసుక లారీలను తెలంగాణ రాష్ట్ర మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ప్రాజెక్టు ఆఫీసర్ తారక్‌నాథ్‌రెడ్డి ఆదివారం తనిఖీ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా పరిమితికి మించి ఇసుక తరలించొద్దని సూచించారు. అధిక లోడ్‌తో వెళ్తున్న లారీలపై ఖనిజాభివృద్ధి శాఖ చర్యలు తీసుకుంటుందని, జరిమానా విధించడంతోపాటు కేసులు నమోదు చేస్తుందని హెచ్చరించారు. తనిఖీల్లో సిబ్బంది పాల్గొన్నారు.

వన దేవతలకు 'బంగారం' మొక్కులు



రెండేళ్లకోసారి జరిగే సమ్మక్క–సారలమ్మ జాతర సందడి మంచిర్యాల జిల్లాలో ఊపందుకుంది. మహాజాతరకు ముందుగా భక్తులు ఇళ్లల్లో సమ్మక్క–సారలమ్మలకు ముందస్తు మొక్కులు చెల్లించుకుంటారు. ఆదివారం జిల్లాలో బంగారం కొనుగోళ్లు ఊపందుకున్నాయి. ఎత్తు బంగారం తూకం వేస్తున్నారు.

- వివరాలు 8లో▸

ఇక్కడైతలేదని అక్కడికి..!

జిల్లాలో ఓ సంక్షేమ వసతి గృహాన్ని బోర్డర్స్‌లేని(విద్యార్థులు) కారణంగా మూసివేశారు. దీంతో ఆ వసతిగృహం వార్డెన్ తనను మరో వసతి గృహానికి బదిలీ చేయాలని అధికారులకు అర్జీ పెట్టుకున్నారు. పలుమార్లు జిల్లా అధికారులను కలిసి విన్నవించారు. కానీ, కొన్ని నెలలపాటు ఆ వినతిని జిల్లా అధికారులు పట్టించుకోలేదు. కొన్ని నెలలపాటు పోస్టింగ్ ఇవ్వకుండా హోల్డ్‌లో పెట్టారు. దీంతో సదరు వార్డెన్ డిసెంబర్ 11న ప్రజాదర్బార్‌లో రాష్ట్రస్థాయి అధికారులకు ఫిర్యాదు చేశారు. స్పందించిన అక్కడి అధికారులు వెంటనే సమస్య పరిష్కరించాలని జిల్లా అధికారులను ఆదేశించారు. వెంటనే విచారణ జరిపిన జిల్లా అధికారులు సదరు వార్డెన్‌కు మరో వసతి గృహంలో పోస్టింగ్ ఇచ్చారు. జిల్లా అధికారుల చుట్టూ నెలలపాటు తిరిగినా పరిష్కారం కాని సమస్య రాష్ట్రస్థాయి అధికారులకు ఒక్కసారి దరఖాస్తు పెట్టుకుంటే పరిష్కారం అయింది.



దండేపల్లి మండలం కాసిపేట గ్రామానికి చెందిన ఆవుల శ్రీనివాస్ తల్లి గంగమ్మ మహిళా రైతు. 2019 ఆగస్టు 20న అనారోగ్యంతో చనిపోయింది. దీంతో ఆమెకు రైతుబీమా పథకం కింద రూ.5 లక్షలు రావాల్సి ఉంది. 2020 నుంచి శ్రీనివాస్ తన తల్లికి రావాల్సిన రైతుబీమా డబ్బుల కోసం ఇటు మండల అధికారులకు, అటు జిల్లా అధికారులకు అర్జీ పెట్టుకున్నారు. అయినా పరిష్కారం మాత్రం దొరకలేదు. ఈ నేపథ్యంలో గతనెలలో హైదరాబాద్ వెళ్లి ప్రజాదర్బార్‌లో ఫిర్యాదు చేశాడు. స్పందించిన ఉన్నతాధికారుల జిల్లా అధికారులకు అర్జీని పంపించి వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. దీంతో రెవెన్యూ, వ్యవసాయ అధికారులు విచారణ ప్రారంభించారు. సమస్య పరిష్కారం అవుతుందని శ్రీనివాస్ ఆశతో ఉన్నాడు.

- ప్రజాదర్బార్‌కు జిల్లా నుంచి దరఖాస్తుల వెల్లువ
- నెల రోజుల్లోనే 61 ఫిర్యాదులు
- స్థానిక ప్రజావాణిలో పరిష్కారం కాకపోవడంతో..
- ప్రజాభవన్ నుంచి జిల్లా అధికారులకు వస్తున్న ఆదేశాలు



కలెక్టరేట్ ప్రజావాణిలో ఫిర్యాదు చేసేందుకు వచ్చిన అర్జీదారులు (ఫైల్)



Dear A SRINIVASULU Garu,
Namaskaram!!
Telangana Chief Minister's Praja Darbar takes note of your grievance regarding REQUEST FOR RAITHU BHEEMA-. Your issue will be attended shortly by the Department concerned.
Ref ID : [illegible]

- Chief Minister Grievance Cell, Government of Telangana

గత నెలలో ప్రజాదర్బార్‌లో ఫిర్యాదు చేసిన జిల్లా వాసికి వచ్చిన రిసీవ్డ్ మెస్సేజ్

మంచిర్యాలఅగ్రికల్చర్: మండల కేంద్రంలో ఎన్నిసార్లు దరఖాస్తు చేసుకున్నా పరిష్కారం కాని సమస్యలపై బాధితులు కలెక్టరేట్‌లోని ప్రజావాణిలో ఫిర్యాదు చేస్తున్నారు. అక్కడ కూడా పలుమార్లు అర్జీ పెట్టుకున్నా పరిష్కారం కాకపోవడంతో ఇప్పుడు బాధితులు రాజధాని హైదరాబాద్‌కు వెళ్తున్నారు. ప్రజాభవన్‌లో నిర్వహిస్తున్న ప్రజాదర్బార్‌లో అర్జీ పెట్టుకుంటున్నారు. రాష్ట్రస్థాయి అధికారులకు తమ గోడు వెల్లబోసుకుంటున్నారు.

సమస్యలు అనేకం.. పరిష్కారం పరిమితం..

జిల్లాలో ప్రజలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా భూ సమస్యలతోపాటు, రైతుబీమా, భూపరిహారం, పెన్షన్లు, కబ్జాలు, ధరణి సమస్యలు అనేకం ఉన్నాయి. వీటి పరిష్కారం కోసం బాధితులు మొదట మండలస్థాయిలో నిర్వహించే ప్రజావాణిలో అర్జీలు పెట్టుకున్నారు. అయితే మండస్థాయిలో సమస్యలు పరిష్కారం కాకపోవడంతో కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజవాణిలో కలెక్టర్‌ను కలిసి తమ సమస్యపై దరఖాస్తులు పెట్టుకున్నారు. నెలలు, సంవత్సరాలు తిరిగినా పరిష్కారం లభించకపోవడంతో కాంగ్రెస్ ప్రభుత్వం హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో ప్రారంభించిన ప్రజాదర్బార్ ఇప్పుడు బాధితుల పాలిట ఆశాదీపంగా మారింది. మండల, జిల్లాస్థాయి అధికారులతో పరిష్కారంకాని తమ సమస్యలు రాష్ట్రస్థాయి అధికారులకు చెప్పుకుంటే అయినా పరిష్కారం దొరుకుతుందన్న ఆశతో మంగళ, శుక్రవారాల్లో నిర్వహించే ప్రజాదర్బార్‌కు వెళ్తున్నారు.

అక్కడి నుంచి తిరిగి ఇక్కడికే..

ప్రజాదర్బార్‌లో స్వీకరించిన అర్జీలను అక్కడి అధికారులు వెంటనే పరిష్కరించాలని తిరిగి జిల్లాస్థాయి అధికారులకు పంపిస్తున్నారు. పై అధికారుల నుంచి వచ్చిన అర్జీ కావడంతో జిల్లా అధికారులు వాటిపై సత్వరం స్పందిస్తున్నారు. స్పందించకుంటే వివరణ ఇవ్వాలని పైఅధికారులు ఆదేశిస్తున్నారు. అక్కడి నుంచి వచ్చే అర్జీలపై జిల్లా అధికారులు స్పందిస్తుండడంతో చాలా మంది ఇప్పుడు రాజధాని బాట పడుతున్నారు. గడిచిన రెండు నెలల్లో జిల్లా నుంచి 61 మంది ప్రజాదర్బార్‌లో దరఖాస్తు చేసుకోవడం గమనార్హం. వీటిలో 29 అర్జీలు ఇప్పటికే పరిష్కారం అయ్యాయి.

భూ సమస్యలే అధికం..

రెవెన్యూ రికార్డుల్లో అధికారుల తప్పిదాలు, ధరణి పోర్టల్‌లో నమోదు చేసిన భూ సమస్యల పరిష్కారంపై ప్రతిష్టంభన నెలకొంది. వీటిపై బాధితులు ఇన్నాళ్లు కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేస్తున్నారు. భూ సరిహద్దులు, సర్వే నెంబర్ల తప్పిదాలు, అటవీ, రెవెన్యూ భూముల సరిహద్దు వివాదాలున్నాయి. నిషేధిత జాబితాలో భూములున్నాయి.

పరీక్ష హాల్‌లో ఒత్తిడికి గురికావొద్దు



స్టడీ మెటీరియల్ చూపుతున్న ఉపాధ్యాయులు

మంచిర్యాలటౌన్: పరీక్ష హాల్‌లో విద్యార్థులు ఒత్తిడికి గురికావొద్దని, ప్రశాంతంగా ఉండాలని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారి రవీందర్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని వీవీడీసీ కళాశాలలో జిల్లాలోని ఎస్సీ వసతి గృహాల విద్యార్థులకు ప్రేరణ–అవగాహన తరగతులు ఆదివారం నిర్వహించారు. రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని సూచించారు. అనంతరం సబ్జెక్టు నిపుణులతో గణితం, భౌతిక, రసాయన శాస్త్రాల పరీక్షలపై అవగాహన కల్పించారు. స్టడీ మెటీరియల్ అందించారు. కార్యక్రమంలో సహాయ సాంఘిక సంక్షేమ అధికారి రవీందర్, వసతిగృహ సంక్షేమ అధికారులు పాల్గొన్నారు.

రామగుండం ఎమ్మెల్యేను కలిసిన రాములు నాయక్

బెల్లంపల్లిరూరల్: బెల్లంపల్లికి చెందిన మున్సిపల్ కౌన్సిల్ ఫోరం రాష్ట్ర చైర్మన్, మున్సిపల్ కౌన్సిలర్ రాములునాయక్ రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్‌ను ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. మున్సిపల్ కౌన్సిలర్ల సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు.

రేషన్ ఈకేవైసీ గడువు పెంపు

మంచిర్యాలటౌన్: రేషన్ కార్డుల్లోని లబ్ధిదారులందరూ ఈకేవైసీ చేసుకునేందుకు ఈ నెలా ఖరు వరకు ఉన్న గడువును రాష్ట్ర పౌరసరఫరా ల శాఖ ఫిబ్రవరి నెలాఖరు వరకు పెంచినట్లు జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి వాజిద్ తెలిపారు. ఇప్పటి వరకు ఈకేవైసీ చేసుకోనివారు వెంటనే రేషన్‌షాపులకు వెళ్లి చేసుకోవాలని సూచించారు.

'బడి' ఎన్నికలకు బ్రేక్

- వాయిదా వేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు
- ఎంపీ ఎన్నికలపై ప్రభావం పడుతుందనే..?
- ఇప్పటికే పాత ఎస్ఎంసీలు రద్దు
- గ్రాంట్ వినియోగానికి అవస్థలు
- కొత్త కమిటీలకు మోక్షం ఎప్పుడో?



PROCEEDINGS OF THE COMMISSIONER, SCHOOL EDUCATION & EX-OFFICIO STATE PROJECT DIRECTOR, SAMAGRA SHIKSHA, TELANGANA, HYDERABAD

ప్రభుత్వం విడుదల చేసిన ఉత్తర్వులు

ఆదిలాబాద్‌టౌన్: నాలుగేళ్ల తర్వాత సర్కారు బడుల్లో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ (ఎస్ఎంసీ) ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం షెడ్యూల్ విడుదల చేసి అర్ధంతరంగా నిలిపివేసింది. గతంలో 2019లో విద్యాకమిటీలను ఎన్నుకోగా, అప్పటి నుంచి పాత కమిటీల పదవీకాలం పొడిగిస్తూ వచ్చారు. కొత్త ప్రభుత్వం వచ్చాక నూతన కమిటీల ఎన్నికల నిర్వహణకు షెడ్యూల్ ప్రకటించింది. అయితే తాజాగా మళ్లీ ఎన్నికలను అభియాన్స్‌లో పెట్టింది. ఒకవేళ ఎంఎంసీ ఎన్నికలు నిర్వహిస్తే రానున్న లోక్‌సభ ఎన్నికలపై దాని ప్రభావం పడుతుందని భావించి ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వ నిర్ణయంతో స్కూల్ పర్యవేక్షణ అస్తవ్యస్తంగా మారనుంది. పాత కమిటీలను కూడా రద్దు చేయడంతో నిధుల వినియోగం చేసే పరిస్థితి కూడా లేకుండా పోయింది. ఎస్ఎంసీ చైర్మన్, హెచ్ఎంల జాయింట్ అకౌంట్‌తోనే డబ్బులను డ్రా చేసే అవకాశం ఉంటుంది. కొత్త కమిటీలు ఏర్పడే వరకు ఆ నిధులు కూడా వినియోగించని దుస్థితి. దీంతో బడి పర్యవేక్షణ గాలికొదిలేసినట్టు కానుంది. ఇప్పటికే ఉమ్మడి జిల్లాలో రెగ్యులర్ జిల్లా విద్యాధికారులు, ఎంఈవోలు లేక విద్యావ్యవస్థ కుంటుపడుతుండగా, ఈ కమిటీల రద్దుతో మరింతగా పర్యవేక్షణ లోపించే అవకాశం ఉంది.

వాయిదా పడ్డ ఎన్నికలు..

ఎస్ఎంసీ ఎన్నికలు గతంలో 2019 డిసెంబర్‌లో నిర్వహించారు. ఆ తర్వాత నుంచి పదవీకాలం పొడిగిస్తూ వచ్చారు. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఈ కమిటీలకు మోక్షం లభించిందని అనుకున్నప్పటికీ మళ్లీ వాయిదా పడ్డాయి. ఉన్న పాత కమిటీలను కూడా రద్దు చేయడంతో నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. ప్రస్తుతం ఆయా పాఠశాలల్లో చేపడుతున్న మన ఊరు–మనబడి పనులు వివిధ దశల్లో ఉన్నాయి. వీటికి సంబంధించిన నిధులను ప్రభుత్వం ఎస్ఎంసీ ఖాతాలోనే జమ చేస్తారు. కమిటీని రద్దు చేయడంతో ఆ డబ్బులను డ్రా చేసే అవకాశం లేదు. గతంలో ఎస్ఎంసీలో ఉన్న నిధులను ఖర్చు చేయకపోవడంతో ప్రభుత్వం ఆ డబ్బులను వెనక్కి తీసుకుంది.

ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల వివరాలు

జిల్లా	పాఠశాలలు
ఆదిలాబాద్	1,223
మంచిర్యాల	839
నిర్మల్	836
కుమురంభీం	906

ఎస్ఎంసీ ఎన్నికలు వాయిదా..

ఎస్ఎంసీ ఎన్నికలను అభియాన్స్‌లో ఉంచుతూ ఈనెల 23న పాఠశాల విద్యా శాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఎన్నికల షెడ్యూల్ విడుదలైనప్పటికీ వివిధ కారణాలతో ప్రభుత్వం తాత్కాలికంగా వాయిదా వేసింది. ఇప్పటికే పాత కమిటీలు రద్దయ్యాయి. ఉన్నతాధికారులు కొత్త షెడ్యూల్ విడుదల చేసిన తర్వాత నూతన కమిటీల నియామకం ఉంటుంది.

– ప్రణీత, డీఈఓ, ఆదిలాబాద్

పర్యవేక్షణ కరువు..

పాత ఎస్ఎంసీల రద్దు, కొత్తవాటి ఎన్నికలు వాయిదా పడడంతో విద్యా వ్యవస్థ కుంటుపడనుంది. ఉమ్మడి జిల్లాలోని చాలా పాఠశాలల్లో కొంత మంది ఉపాధ్యాయులు సమయపాలన పాటించకపోవడం పరిపాటిగా మారింది. ఎస్ఎంసీలు ఉన్న సమయంలో ఇలాంటివి చాలా వరకు జరిగేవి కావు. ప్రస్తుతం ఈ కమిటీలు లేకపోవడంతో పర్యవేక్షణ కరువయ్యే అవకాశం లేకపోలేదు. పాఠశాల అభివృద్ధి పనుల కోసం నిధులు అవసరమైతే సంబంధిత ఎమ్మెల్యే, ప్రజాప్రతినిధులు, అధికారులను కలిసి సమస్యను విన్నవించి పరిష్కారం కోసం కృషి చేసేవారు. ఇప్పుడు ఆ కమిటీలు లేకపోవడంతో పాఠశాల అభివృద్ధి కుంటుపడే అవకాశం ఉంది. ఉమ్మడి జిల్లా పరిధిలోని చాలా పాఠశాలల్లో మన ఊరు–మనబడి పనులు జరుగుతున్నాయి. ఈ పనులను కమిటీ సభ్యులు పర్యవేక్షించేవారు. పనుల్లో నాణ్యత లోపించకుండా చూసేవారు. వీరు లేకపోవడంతో ఆ పనుల్లో కూడా జాప్యం జరిగే అవకాశాలు ఉన్నాయి. గతంలో ఎస్ఎంసీలు రద్దు చేసిన సమయంలో నిధుల వినియోగం కోసం పాఠశాల ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాధికారికి జాయింట్ అకౌంట్ ఇచ్చారు. అయితే ఈ ఎస్ఎంసీల స్థానంలో ప్రత్యేక అధికారులను నియమిస్తారా.. లేక మండల విద్యాధికారి, స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎంలకు బాధ్యతలు అప్పగిస్తారా అనేది వేచి చూడాల్సిందే.

స్వపక్షంలో.. విపక్షం!

- క్యాతనపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్ చైర్మన్‌పై సొంత పార్టీ 'అవిశ్వాసం'
- ఫిబ్రవరి 6న తీర్మానంపై సమావేశం
- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడికి తెలియకుండానే కౌన్సిలర్ల పావులు
- పరిణామాలపై పెదవి విరుస్తున్న గులాబీ నేతలు



క్యాతనపల్లి మున్సిపల్ కార్యాలయం

రామకృష్ణాపూర్: క్యాతనపల్లి మున్సిపాలిటీలో అవిశ్వాస తీర్మానం కలకలం రేపుతోంది. స్వపక్షంలోనే విపక్షంలా బీఆర్ఎస్ కౌన్సిలర్లే చైర్ పర్సన్, వైస్ చైర్మన్‌పై అవిశ్వాసం ప్రకటించడం చర్చనీయాంశమైంది. పార్టీ జిల్లా అధ్యక్షుడు బాల్క సుమన్‌కు తెలియకుండానే కౌన్సిలర్లు పావులు కదుపుతుండడం గమనార్హం. పదవీ వ్యామోహంతోనే ఒకవర్గం ప్రస్తుత చైర్‌పర్సన్, వైస్ చైర్మన్‌పై అవిశ్వాసం పెట్టాలని నిర్ణయించినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ క్రమంలో అవిశ్వాసంతోపాటు తర్వాత చైర్‌పర్సన్, వైస్ చైర్మన్ పదవులకు మద్దతు ఇచ్చే కౌన్సిలర్లకు రూ.3 లక్షల చొప్పున ముట్టజెప్పేందుకు మంతనాలు జరుగతున్నట్లు తెలుస్తోంది.

6న సమావేశం..

క్యాతనపల్లి మున్సిపాలిటీలో 20 మంది కౌన్సిలర్లు ఉన్నారు. అందరూ బీఆర్ఎస్ సభ్యులే. అవిశ్వాసం నెగ్గినా, వీగినా తిరిగి పదవులు దక్కేది ఆ పార్టీ కౌన్సిలర్లకే. కానీ, కొంతమంది పదవిపై వ్యామోహంతో చైర్‌పర్సన్, వైస్ చైర్మన్‌ను గద్దె దించేందుకు ప్రయత్నిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీకి అవిశ్వాసం పెట్టే అవకాశం ఇవ్వకూడదనే వ్యూహాత్మక ఎత్తుగడలతోనే ఈ పరిణామాలు చోటుచేసుకుంటున్నాయని కొంతమంది చెబుతున్నారు. కానీ, సొంత పార్టీ కౌన్సిలర్లే అవిశ్వాసం ప్రకటించడం పార్టీలో చర్చనీయాంశమైంది.

అధ్యక్షుడికి తెలియకుండా...

క్యాతనపల్లి మున్సిపాలిటీ అవిశ్వాస తీర్మానం పెట్టడం వెనుక బలమైన కారణాలు కనిపించడం లేదు. చైర్‌పర్సన్, వైస్ చైర్మన్ మార్పు మినహా ఎవరికీ పెద్దగా ఒరిగేది ఏమీ ఉండదు. అయినా అవిశ్వాసం ప్రక్రియ పూర్తిగా పార్టీ జిల్లా అధ్యక్షుడికి తెలియకుండానే జరుగడం చర్చనీయాంశమైంది. తాజా పరిణామాలపై ప్రస్తుత చైర్‌పర్సన్, వైస్ చైర్మన్ కూడా ఆగ్రహంతో ఉన్నట్లు తెలుస్తోంది. పార్టీలో కుంపటి రాజుకుంటున్నా జిల్లా అధ్యక్షుడు కనీసం పట్టించుకోకపోవడం చర్చనీయాంశమైంది.

విద్యారంగ అభివృద్ధికి కృషి

- ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు

మంచిర్యాలఅర్బన్: విద్యారంగ అభివృద్ధికి, ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు అన్నారు. స్థానిక పద్మనాయక ఫంక్షన్‌హాల్‌లో నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, మోడల్‌స్కూళ్లు, కేజీబీవీలు, యూఆర్ఎస్ స్పెషల్ ఆఫీసర్లతో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు నిబద్ధతతో పనిచేస్తానన్నారు. విద్యార్థుల సంఖ్య రెట్టింపు కావడమే తన లక్ష్యమన్నారు. నాణ్యమైన బోధన, ఉత్తమ ఫలితాలు సాధనతో సర్కారు పాఠశాలలను బలోపేతం చేయాలని సూచించారు. కలెక్టర్ బదావత్ సంతోష్ మాట్లాడుతూ సర్కారు పాఠశాలల్లో విద్యనభ్యసించే విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫాం, ఉచిత భోజనంతోపాటు అనేక సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. పాఠశాలలో స్కావెంజర్ల సమస్యను గుర్తించామని, రాష్ట్రస్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. అప్పటి వరకు గ్రామపంచాయతీ, మున్సిపల్ సిబ్బంది శుభ్రపరిచేలా చూస్తామన్నారు. అనంతరం ప్రధానోపాధ్యాయులు, సంఘం బాధ్యులు పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను వివరించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ రాహుల్, డీఈవో యాదయ్య, సమగ్రశిక్ష కోఆర్డినేటర్లు చౌదరి, శ్రీనివాస్, సత్యనారాయణమూర్తి, యశోధర, రాజ్‌కుమార్, ఎంఈవోలు రవీందర్, పోచయ్య, వివిధ ఉపాధ్యాయ సంఘాల బాధ్యులు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

అక్రమ దందాకు అడ్డేది..?



పునాది నిర్మాణం కోసం సిద్ధంగా ఉంచిన బండరాళ్లు

బెల్లంపల్లి: పట్టణంలో అధికారం మాటున అడ్డగోలుగా అక్రమ దందా సాగుతోంది. పేదలకు నివేశన(నివాస) స్థలాల కోసం కేటాయించిన ప్రభుత్వ భూమిని దర్జాగా కబ్జా చేసి అమ్మేస్తున్నారు. ఇందిరమ్మ ఇళ్లను, ఖాళీ స్థలాలను చౌకగా కొనుగోలు చేసి మారు బేరం సాగిస్తున్నారు. కొన్నాళ్లుగా ఈ దందా సాగుతున్నా అడ్డుకునే అధికారులు కరువయ్యారు. బెల్లంపల్లి మున్సిపాలిటీలోని నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం 2004లో అప్పటి ప్రభుత్వం ఇళ్ల స్థలాలను గుర్తించింది. గురిజాలకు వెళ్లే ప్రధాన రహదారి పక్కన ఉన్న బూధాకలాన్ గ్రామ శివారు సర్వే నంబర్ 170 లో ఉన్న ప్రభుత్వ భూమిని కేటాయించారు. అయితే అక్కడ ఇళ్లు కట్టుకోవడానికి చాలా మంది ఆసక్తి చూపలేదు. ఖాళీగా ఉన్న ఈ స్థలాన్ని ఓ ప్రజాప్రతినిధి తన అధికారం అడ్డం పెట్టుకుని అక్రమ దందాకు తెర తీశాడు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల వివరాలు సేకరించి నయాన భయాన అమ్మకాలు చేసేలా కుయుక్తులు పన్నాడు. అన్నీ కొనుగోలుచేసి అసంపూర్తిగా ఉండిపోయిన ఇళ్లను, ఇంటి స్థలాలను విక్రయించి సొమ్ము చేసుకున్నారు. బుధాకలాన్ గ్రామ పంచాయతీ నుంచి అనుయాయులకు ఇళ్లకు ఇంటి నంబర్లు కూడా మంజూరు చేయించినట్లు తెలుస్తోంది.

అధికారుల మౌనం..

ఇందిరమ్మ ఇళ్ల క్రయ విక్రయాలు, ఖాళీ స్థలాల కబ్జా యథేచ్ఛగా సాగుతున్నా రెవెన్యూ అధికారులు అటువైపు కన్నెత్తి చూడడం లేదు. నిబంధనలకు విరుద్ధంగా ఇంటి నంబర్లను కేటాయించినా చర్యలు తీసుకునే నాథుడు కరువయ్యాడు. దీంతో అధికారుల తీరుపై విమర్శలు రావడంతో ఆర్డీవో హరికృష్ణ, తహసీల్దార్ సుధాకర్ శనివారం తన సిబ్బందితో వెళ్లి ఇందిరమ్మ కాలనీని పరిశీలించారు. కొందరి ఇళ్లను కూల్చివేయించారు. అయితే ప్రజాప్రతినిధి అనుయాయులు నిర్మించుకున్న ఇళ్ల జోలికి మాత్రం వెళ్లలేదు.

పాఠశాల విద్య అధ్యయనానికి కమిటీ వేయాలి

జన్నారం: ప్రభుత్వం పాఠశాల విద్య అధ్యయనానికి నిపుణులతో కమిటీ వేయాలని తెలంగాణ ఎస్సీ, ఎస్టీ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జాడి రాజన్న డిమాండ్ చేశారు. జన్నారంలో ఆదివారం మాట్లాడారు. క్షేత్రస్థాయిలో పాఠశాల విద్య స్థితిగతులను తెలుసుకుని పాఠశాల విద్య బలోపేతానికి కృషి చేయాలన్నారు. ప్రతీ మండలంలో నర్సరీ నుంచి ఐదో తరగతి వరకు ప్రత్యేక ఇంగ్లిష్ మీడియం పాఠశాల ఏర్పాటు చేయాలన్నారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం, విద్యాశాఖ పటిష్టత కోసం ఉపాధ్యాయ సంఘాలతో సీఎం సమావేశం ఏర్పాటు చేయాలని కోరారు. ఉపాధ్యాయులకు టెట్ నిర్వహించి వేసవి సెలవుల్లో ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు చేపట్టాలన్నారు. సమావేశంలో ఎస్సీ, ఎస్టీ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు రాంటెంకి శ్రీనివాస్, మండల అధ్యక్షుడు గోపాల్, ఆర్థిక కార్యదర్శి మల్లేశ్, నాయకుడు రాజేశ్వర్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

సర్వే మజ్దూర్ పరీక్ష



పరిశీలిస్తున్న జీఎం సంజీవరెడ్డి

శ్రీరాంపూర్: సింగరేణిలో ఖాళీగా ఉన్న సర్వే మజ్దూర్ పోస్టుల భర్తీకి ఆదివారం రాత పరీక్ష నిర్వహించారు. అంతర్గత ఉద్యోగులతో వీటిని భర్తీ చేస్తున్నారు. ఏరియాలోని ఉద్యోగాలకు సీసీసీలోని సింగరేణి ఉన్నత పాఠశాలలో పరీక్ష నిర్వహించారు. పరీక్షా కేంద్రాన్ని శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డి సందర్శించారు. పరీక్షలను పూర్తి పారదర్శకంగా, పగడ్బందీగా పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. అభ్యర్థుల సామర్థ్యం ఆధారంగా వీటిని భర్తీ చేయడం జరుగుతుందన్నారు.

అహంకారం వీడితే భవవంతుడు సాక్షాత్కారం

మంచిర్యాలఅర్బన్: నేను అనే అహంకారం వీడితేనే అందరికి భగవంతుడు సాక్షాత్కారమవుతాడని పురణాలలో భాగవతం ప్రాముఖ్యతను వక్తలు మలయశ్రీ, ప్రసాద్‌లు వివరించారు. ఆదివారం స్థానిక సరస్వతి శిశుమందిర్‌లో జిల్లా సాహితీ సంరక్షణ సమితి ఆధ్వర్యంలో కవి సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా కవి, విశ్రాంత తెలుగు పండితులు మలయశ్రీ, కవుటూరు ప్రసాద్‌లు భాగవతంపై ప్రసంగం చేశారు. సంస్థ ప్రధాన కార్యదర్శి అల్లాడి శ్రీనివాస్, కవులు సుగుణాకర్, సంతోష్, ధనుంజయ్ తదితరులు హాజరై కవి సమ్మేళనం సాహితీ ప్రసంగం అద్యంతం అందరిని అలరించింది. సంస్థ అధ్యక్షుడు వామన్‌రావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ప్రసంగకర్త కవుటూరు ప్రసాద్‌ను సన్మానించారు.

సీఎంపీఎఫ్‌ను ప్రక్షాళన చేస్తున్నాం



మాట్లాడుతున్న లక్ష్మారెడ్డి

శ్రీరాంపూర్: కోల్ మైన్స్ ప్రావిడెంట్ ఫండ్ (సీఎంపీఎఫ్) ట్రస్టీని ప్రక్షాళన చేస్తున్నట్లు ట్రస్టీ బోర్డు సభ్యుడు, బీఎంఎస్ బొగ్గు పరిశ్రమల ఇన్‌చార్జి కె.లక్ష్మారెడ్డి తెలిపారు. ఆదివారం నస్పూర్‌లోని శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం పీఎఫ్ నిధి భద్రంగా ఉండడం కోసం, అవినీతికి తావు లేకుండా చూడాలనే ఉద్దేశంతో ఉద్యోగుల ఖాతాలను ఆన్‌లైన్‌లో నేరుగా చెక్ చేసుకొనేలా ఏర్పాట్లు చేయిస్తున్నట్లు తెలిపారు. త్వరలోనే ఉద్యోగులు తమ సీఎంపీఎఫ్ ఖాతాతో ఆన్‌లైన్ పద్ధతిలో వారి జమా మొత్తం తెలుసుకునే వీలు కలుగనుందని పేర్కొన్నారు. తమ సంఘం కృషితో నేడు ఈ సదుపాయం కలుగుతుందన్నారు. గతంలో ఈ శాఖలో అనేక అవినీతి కుంభకోణాలు జరిగాయని, ఎంతో సొమ్ము ఉందో కూడా కార్మికులకు తెలుసుకోలేని పరిస్థితి ఉండేదన్నారు. ఇప్పుడు దాన్ని పారదర్శకంగా చేయడం కోసం ట్రస్టీలో ఒత్తిడి తెచ్చామన్నారు. ఈ కార్యక్రమంలో బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య, ఏబీకేఎంఎస్ కార్యవర్గ సభ్యులు పులి రాజిరెడ్డి, కారంపూడి శ్రీనివాస్ రాజు, శ్రీరాంపూర్ ఏరియా కార్యదర్శి నాతాతి శ్రీధర్ రెడ్డి, నాయకులు రమేష్, జీడి ప్రభాకర్, రాగం రాజేందర్, రామగిరి పురుషోత్తమ చారి, రాజకుమార్, చంద్రశేఖర్, ఓదెలు, మహేందర్, మేడి వంశీకృష్ణ పాల్గొన్నారు.

జంగుబాయి క్షేత్రం.. జనసందోహం

- దక్షిణ భారతదేశంలోనే ఏకైక పుణ్యక్షేత్రం
- వెల్లువిరిసిన ఆధ్యాత్మికత
- ఇప్పటికే దర్శించుకున్న 210మేళాలు
- తండోపతండాలుగా తరలివస్తున్న ఆదివాసీలు
- సంప్రదాయాలతో కొనసాగుతున్న పూజలు
- దైవాక్షేత్రానికి చేరుకుంటున్న ఆదివాసీలు



పోచమ్మకు పూజలు చేస్తున్న భక్తులు



సంయుక్తంగా మొక్కుతున్న భక్తులు

కెరమెరి(ఆసిఫాబాద్): ఆచార వ్యవహారాలు, సంస్కృతి, సంప్రదాయాల మధ్య జంగుబాయికి ఆదివాసీలు మొక్కులు చెల్లించుకుంటున్నారు. దక్షిణ భారత దేశంలోనే ప్రజాధారణ పొందిన ఏకైక ఆదివాసీల పుణ్యక్షేత్రంగా మండలంలోని మహరాజ్‌గూడ గ్రామ సమీపంలో కొలువుదీరిన జంగుబాయి దర్శనం కోసం తెలంగాణలోని ఆదివాసీలే కాకుండా మహారాష్ట్ర, కర్ణాటక, ఒరిస్సా, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, ఛత్తీస్‌గఢ్‌లకు చెందిన భక్తులు తండోపతండాలుగా తరలివస్తున్నారు. అమ్మ దర్శనానికి ఆదివారం భక్తులు భారీగా తరలిరాగా కిటకిటలాడింది.

పుష్యమాసం నుంచి ప్రారంభం

ఈ నెల 14 పుష్యమాసం నుంచి ప్రారంభమైన ఈ ఉత్సవాలు ఈ నెల రోజుల పాటు కొనసాగుతాయని ఆలయ కమిటీ చైర్మన్ కొడప జాకు, గౌరవాధ్యక్షుడు మరప బాజీరావు తెలిపారు. ఇప్పటి వరకు 210 మేళంలు జంగుబాయిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నాయి. సాంప్రదాయ నృత్యాలు, ఆదివాసీ వంటకాల ఘుమఘుమలు, నలువైపుల ఉన్న సుందర దృష్యాలు చూపురులను మంత్రముగ్ధుల్ని చేస్తుంది. ఎంతదూరమైన భక్తులు చెప్పులు లేకుండా కాలినడకన రావడం, చిన్నారులైతే ఎడ్లబండ్లపై వస్తున్నారు. ఆలయ సమీపంలోని గుహలో జంగుబాయి, లక్ష్మీదేవి కొలువై ఉంది. గుహలోని ఆ తల్లుల దర్శనానికి ఆదివాసీలు క్యూ కడుతున్నారు. ఆదిమ తెగల్లో తుంద్రం, రాయిసిడం, వెట్టి, హెరెకుమ్ర, మరప, మండాడి, సలాం, కొడప గోత్రాల వారుకటోడలుగా వ్యవహరిస్తూ పూజ కార్యక్రమాలు కొనసాగిస్తున్నారు.



సాంప్రదాయ వంటకాలు చేస్తున్న మహిళలు



ఆలయానికి వస్తున్న మోళం



రావుడ్ దేవత వద్ద పూజలు నిర్వహిస్తున్న మహిళలు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళన దృశ్యం

మంచిర్యాలరూరల్(హాజీపూర్): వారంతా చిన్ననాటి స్నేహితులు.. కలిసి ఆడిపాడారు.. చదువుకున్నారు.. ఉన్నత చదువుల కోసం తలోదారి పట్టారు. ఇంకేముంది అంతా దూరమయ్యారు.. అలా దూరమైన అలనాటి బాల్య మిత్రులు నేడు పూర్వ విద్యార్థులుగా కలుసుకున్నారు. ఇలా కలుసుకున్న ఆ బాల్యమిత్రుల్లోని ఆనందం అంతాఇంతా కాదు.. మరచిపోలేని జ్ఞాపకాలను.. చిలిపి అల్లరిని గుర్తు చేసుకుంటూ ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉత్సాహంగా.. ఉల్లాసంగా గడిపారు. అరేయ్ నన్ను గుర్తు పట్టావా.? ఏంటి నువ్వేనా.. ఇంతలా మారిపోయావేంటి అంటూ పలకరింపులు.. నవ్వులు.. చిలిపి చేష్టల జ్ఞాపకాలతో బాల్యమిత్రుల సంతోషాలకు అవధులేకుండా పోయింది. ఈ అంతులేని ఆనందానికి.. పట్టరాని సంతోషానికి వేదికగా నిలిచింది.. పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం.. మంచిర్యాల జిల్లా కేంద్రంలోని హమాలీవాడ సినిమావాడ ప్రభుత్వ పాఠశాల పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం హాజీపూర్ మండలం దొనబండలోని ఓ వ్యవసాయ క్షేత్రంలో ఆనందోత్సాహాల మధ్య జరిగింది.

చాలా ఏళ్ల అనంతరం ఒకేచోట..

సినిమావాడ ప్రభుత్వ పాఠశాలలో 1982 నుంచి 1988 వరకు 1 నుంచి 7వ తరగతి వరకు చదువుకున్న విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనంలో స్నేహపూర్వకంగా కలిశారు. 36 నుంచి 42ఏళ్ల తర్వాత కలిసిన వీరంతా పాఠాలు బోధించిన ఆచార్యులతో ఒక చోటకు చేరి ముచ్చట్లలో మునిగిపోయి ఆనంద క్షణాలను పంచుకున్నారు. పాఠశాల పూర్వ ప్రధాన ఉపాధ్యాయుడు సత్యనారాయణ, మాజీ డెప్యూటీ డీఈవో చారి, ఉపాధ్యాయుడు రాజేంద్రప్రసాద్‌లను శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఇందులో కుందారపు రమేశ్, గుండా శ్రీధర్, చెంచు శ్రీనివాస్, హన్మంతు, హరిప్రసాద్, కరుణాకర్, శేఖర్, శంకర్‌మూర్తి, చెల్లిమల్ల రాజు, మల్లేశ్ పాల్గొన్నారు.

అధికారుల సంఘం ఏరియా అధ్యక్షుడిగా రమేష్



మందమర్రి ఏరియాలో నూతనంగా ఎన్నికైన అధికారుల సంఘం కమిటి సభ్యులు

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలోని ఇల్లందు క్లబ్‌లో ఆదివారం జరిగిన సింగరేణి అధికారుల సంఘం (సీఎంవోఏఐ) ఏరియా కమిటీ ఎన్నికల్లో అధ్యక్షుడిగా సట్యూరి రమేష్ (డిప్యూటీ మేనేజర్, ఎస్టేట్స్) ఎన్నికయ్యారు. మొత్తం 179 ఓట్లకు 150 ఓట్లు పోల్ కాగా రమేష్‌కు 79 ఓట్లు వచ్చాయి. ప్రత్యర్థి విజయ్‌ప్రసాద్ (డీవై జీఎం, శాంతిఖని)కు 71 ఓట్లు పోలయ్యాయి. ఇద్దరు ఉపాధ్యక్ష పదవులకు ముగ్గురు పోటీ పడ్డారు. సీహెచ్ వెంకటేశ్వర్లుకు 99, దాసి నాగవర్ధన్‌కు 94 ఓట్లుతో గెలిచారు. ఇద్దరు జాయింట్ సెక్రెటరీ పోస్టులకు ఏడుగురు పోటీ చేయగా రాయబారపు నరేష్ (డీవై ఎస్‌ఈ)కు 74 ఓట్లు, కొట్టె రవి (డిప్యూటీ మేనేజర్, ఐటీ)కి 64 ఓట్లతో గెలిచారు. ఏరియా జాయింట్ ట్రెజరరీగా ఇద్దరు పోటీలో నిలువగా 87 ఓట్లతో మామిడిపల్లి సంతోష్ గెలుపొందారు. ఏరియా సెక్రెటరీగా పైడీశ్వర్ (ఎస్‌ఈ, ఈఅండ్‌ఎం), ఏరియా ట్రెజరరీగా ఎర్ర సుధారాణి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ ఎన్నికలకు ఏరియా జీఎం మనోహర్ రిటర్నింగ్ ఆఫీసర్‌గా వ్యవహరించగా కోల్ ఇండియా నుంచి సీఎంవోఏఐ అధికారులు శరత్‌కుమార్ తివార్, అజిత్ కుమార్ మిశ్రా పర్యవేక్షించారు.

శ్రీరాంపూర్ అధ్యక్షుడిగా వెంకటేశ్వర్‌రెడ్డి..



వెంకటేశ్వర్‌రెడ్డి

శ్రీరాంపూర్: కోల్‌మైన్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా(సింగరేణి) ఎన్నికలు ఆదివారం జరిగాయి. డివిజన్, కంపెనీ స్థాయిలో వేరువేరుగా కమిటీలను ఎన్నుకున్నారు. ఈ ఎన్నికల ఓటింగ్, కౌటింగ్ ప్రక్రియంతా కూడా సీసీసీలోని ఎస్సీఓఏ క్లబ్‌లో జరిగింది. ఏరియా జీఎం బి.సంజీవరెడ్డి ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా వ్యవహరించారు. మొత్తం 217 మంది అధికారులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఉత్కంఠ భరితంగా జరిగిన ఈ ఎన్నికల్లో శ్రీరాంపూర్ డివిజన్ అధ్యక్షుడిగా కె.వెంకటేశ్వర్‌రెడ్డి ఎన్నికయ్యారు. అధ్యక్ష స్థానానికి వెంకటేశ్వర్‌రెడ్డి, జక్కారెడ్డి, గోపాల్‌సింగ్‌లు పోటీ పడగా ఇందులో తన సమీప పత్యర్థి జక్కారెడ్డికి 89 ఓట్లు రాగా, వెంకటేశ్వర్‌రెడ్డికి 101 ఓట్లుతో అధ్యక్ష స్థానాన్ని కైవసం చేసుకున్నారు. మిగితా పోస్టులకు కౌంటింగ్ జరుగుతోంది.

29న సమావేశం

శ్రీరాంపూర్: ఉద్యోగ నియామక పత్రాల కోసం ఎదురుచూస్తున్న అభ్యర్థులకు ఈ నెల 29న సాయంత్రం 5 గంటలకు సీసీసీలోని నరసయ్య భవన్‌లో సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు ఏఐటీయూసీ శ్రీరాంపూర్ బ్రాంచ్ కార్యదర్శి ఎస్కే బాజీసైదా ఆది వారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య హాజరవుతారన్నారు. కార్పొరేట్ మెడికల్ బోర్డు ద్వారా అన్‌ఫిట్ అయిన కార్మికుల పిల్లలు, ఎక్స్‌ట్రనల్ ఉద్యోగాలలో ఉత్తీర్ణత సాధించిన ఎన్నికల కోడ్ పేరుతో నియామక పత్రాలను కంపెనీ పంపిణీ చేయలేదన్నారు. వీరికి నియామక పత్రాలు ఇవ్వాలని కోరుతూ ఈ నెల 27న జీఎం కార్యాలయాల వద్ద జీఎంలకు వినతిపత్రం సమర్పించినట్లు తెలిపారు. ఐనప్పటికీ కంపెనీ స్పందించకపోవడంతో భవిష్యత్ కార్యాచరణలో భాగంగా ఈ సమావేశాన్ని ఏర్పాటు చేస్తున్నామని, అభ్యర్థులందరూ హాజరు కావాల్సిందిగా కోరారు.

పీఎంను కలిసిన 'ఉజ్వల' లబ్ధిదారులు





పీఎం మోదీని కలిసిన కత్తెర్ల రోజా, సాయికుమార్ దంపతులు

కౌటాల: ప్రధాన మంత్రి ఉజ్వల యోజన పథకంలో భాగంగా కౌటాల మండల కేంద్రానికి చెందిన లబ్ధిదారులు కత్తెర్ల సాయికుమార్– రోజా దంపతులు శనివారం ఢిల్లీలో దేశ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీని కలిశారు. ఉజ్వల పథకానికి ఎంపికైన పలు రాష్ట్రాలకు చెందిన లబ్ధిదారులతో పీఎం ముఖ్య కార్యాలయంలో సమావేశం నిర్వహించగా కౌటాలకు చెందిన సాయికుమార్ – రోజా దంపతులకు అవకాశం లభించింది. కేంద్ర ప్రభుత్వ హయంలో అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తామని పీఎం మోదీ సమావేశంలో మాట్లాడినట్లు వారు పేర్కొన్నారు. ఉజ్వల యోజన కింద కేంద్ర ప్రభుత్వం పేద మహిళలకు ఉచితంగా గ్యాస్ కనెక్షన్లు అందించడంతో పథకం పనితీరును పీఎం మోదీ లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. గతంలో కట్టెల పొయ్యి మీద వంట చేసేవాళ్లమని, ఉజ్వలతో తమ కష్టాలు దూరమైనట్లు పీఎంకు వివరించినట్లు వారు తెలిపారు.

ట్రాక్టర్ బోల్తా... డ్రైవర్ మృతి



సాయి కిరణ్ (ఫైల్)

భీమారం: మంచిర్యాల జిల్లా భీమారం మండలం దాంపూర్ గ్రామశివారులోని పొలంలో ఆదివారం వీల్స్ ట్రాక్టర్ బోల్తాపడడంతో డ్రైవర్ సిడాం సాయికిరణ్(22) మృతి చెందినట్లు ఎస్సై రాజవర్ధన్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం... పొలంలో వీల్స్ ట్రాక్టర్‌తో చదును చేస్తుండగా అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ దానికింద పడి అక్కడికక్కడే మృతిచెందాడు. కాగా తండ్రి చంద్రయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చెన్నూరు ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు ఆయన పేర్కొన్నారు.



బోల్తాపడిన కేజీవీల్స్‌ట్రాక్టర్

వనదేవతలకు 'బంగారం' మొక్కులు..!



బంగారం తూకం వేయిస్తున్న భక్తులు



తూకం వేయించిన బంగారంతో భక్తులు

- మొదలైన బెల్లం కొనుగోళ్లు
- దుకాణాల వద్ద భక్తుల కోలాహలం

మంచిర్యాలఅర్బన్/మంచిర్యాలరూరల్(హాజీపూర్): ఫిబ్రవరి 21 నుంచి ప్రారంభమయ్యే మేడారం సమ్మక్క, సారలమ్మ మహాజాతరకు నెలరోజుల ముందుగానే జిల్లాలో సందడి నెలకొంది. రెండేళ్లకోసారి జరిగే వనదేవతల జాతర ఈ నేపథ్యంలో బెల్లంకు (బంగారం) డిమాండ్ ఉంటుంది. దీంతో స్థానిక వ్యాపారులు ఇప్పటికే మహారాష్ట్రలోని లాతూర్, నాందేడ్ నుంచి బెల్లాన్ని పెద్ద ఎత్తున దిగుమతి చేసుకున్నారు. జాతర సమీపిస్తుండడంతో జిల్లా కేంద్రంలోని ఆయా దుకాణాల వద్ద సందడి నెలకొంది.

భక్తుల కోలాహలం

మంచిర్యాలలోని హోల్‌సేల్ వ్యాపారులు ఇప్పటికే మహారాష్ట్ర నుంచి లారీల్లో బెల్లం దిగుమతి చేసుకున్నారు. ఒక్కో లారీలో ఒక్కో ముద్ద పదికిలోల చొప్పున ఉండే 1600 ముద్దలు (16 టన్నులు) చొప్పున ఇక్కడకు దిగుమతి అయ్యాయి. ఈ ఏడాది కిలోకు రూ.38 చొప్పున బెల్లం విక్రయిస్తున్నారు. మంచిర్యాల నుంచి మంథని, సిరోంచ, కోల్‌బెల్ట్ ప్రాంతమైన మందమర్రి, శ్రీరాంపూర్, బెల్లంపల్లి, సిర్పూర్ కాగజ్‌నగర్, తదితర ప్రాంతాలకు బెల్లం సరఫరా అవుతుంది. అమ్మవారి జాతరకు వెళ్లే ముందు మొక్కుకున్న వారు నిలు వెత్తు బంగారం (బెల్లం) పంచిపెట్టడం ఆనవాయి తీ. దీంతో బెల్లం దుకాణాలకు భక్తుల తాకిడి పెరుగుతోంది. మేడారం జాతరకు వెళ్లే భక్తులు ముందుగా వేములవాడ రాజరాజేశ్వరస్వామిని దర్శించుకుంటారు. ఆతర్వాతే వనదేవతల వద్దకు వెళ్లి మొక్కులు చెల్లించుకుంటారు. సమ్మక్క–సారలమ్మ దర్శనానికి మున్ముందు వచ్చే భక్తుల రద్దీ దృష్ట్యా ముందస్తుగానే మేడారం వెళ్లి మొక్కులు చెల్లించుకుని వస్తున్నారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఫ్రీ జర్నీ ఉంటుందని మంత్రి సీతక్క ప్రకటించడంతో బస్సుల్లో ప్రయాణికుల రద్దీ కూడా అధికంగా ఉండే అవకాశాలు లేకపోలేదు. దీంతో నెలరోజుల ముందుగానే బంగారం (బెల్లం) పంచిపెట్టే కార్యక్రమం చేపదుతుండడంతో అంతటా సందడిగా నెలకొంది.

సింగరేణి అధికారుల సంఘం ఎన్నికలు

- ఏకగ్రీవంగా ఏరియా సెక్రటరీ, ట్రెజరరీ



ఓటును వినియోగించుకుంటున్న అధికారులు

మందమర్రిరూరల్: సింగరేణి ఉద్యోగుల సంఘం (సీఎంవోఏఐ) ఎన్నికలు ఆదివారం మందమర్రి ఏరియాలోని ఇల్లందు క్లబ్‌లో ప్రశాంతంగా నిర్వహించారు. మందమర్రి ఏరియా సంఘం సెక్రటరీగా పామర్ల పైడీశ్వర్, ట్రెజరరీగా ఎర్ర సుధారాణి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఏరియా అధ్యక్ష పదవికి విజయ్ ప్రసాద్ (డీవైజీఎం), సట్యూరి రమేష్ (డెప్యూటీ మేనేజర్), వైస్ ప్రెసిండెంట్‌గా రెండు పోస్టులకు రాజన్న (డీవైజీఎం, ఐఈ), దాసి నాగవర్ధన్ (సీనియర్ అండర్ మేనేజర్), సీహెచ్ వెంకటేశ్వర్లు (డీవైజీఎం), ఏరియా జాయింట్ సెక్రటరీగా రెండు పోస్టులకు కొట్టే రవి (డెప్యూటీ మేనేజర్, ఐటీ), రాయబారపు నరేష్ (డీవైఎస్‌ఈ, ఈఅండ్‌ఎం), కోట జశ్వంత్ (సీనియర్ అండర్ మేనేజర్), కె.భార్గవ్ (సీనియర్ పీవో), మస్కుల కార్తీక్ (సీనియర్ పీవో), జి.ప్రశాంత్ జీవన్ (ఎస్‌ఈ, ఎస్ ఎంఎంసీ), పందిళ్ల ప్రభాకర్ (సర్వే ఆఫీసర్), ఏరియా జాయింట్ ట్రెజరరీగా మామిడిపెల్లి సంతోష్ (సీనియర్ అండర్ మేనేజర్), పడాల నర్సయ్య (డెప్యూటీ ఎస్ఎస్‌వో)లు పోటీలో ఉండగా, మందమర్రి ఏరియాలో 198 మంది అధికారులు ఉన్నారు.

ముగిసిన ఓఎంఎస్‌సీ క్రికెట్ టోర్నీ



ట్రోఫీని అందిస్తున్న డిసిపి సుధీర్ కేకన్

మంచిర్యాలటౌన్: పాతమంచిర్యాల స్పోర్ట్స్ క్లబ్ (ఓఎంఎస్‌సీ) ఆధ్వర్యంలో తూముల భీమయ్య ట్రస్టు సౌజన్యంతో పాతమంచిర్యాల మున్సిపల్ క్రీడా మైదానంలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి క్రికెట్ టోర్నమెంట్ ఆదివారం ముగిసింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డీసీపీ సుధీర్ కేకన్, ఏసీపీ తిరుపతిరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ క్రీడాకారులు క్రీడా స్ఫూర్తితో ఆడాలని సూచించారు. ప్రతిభ ఉన్న క్రీడాకారులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. విజేతగా నిలిచిన ఎడ్ల రవి సింగపూర్ జట్టుకు రూ.50 వేల నగదు, ట్రోఫీని, రన్నర్స్ జట్టు రజక టీంకు రూ.25 వేల నగదు, ట్రోఫీని డీసీపీ అందించారు. టోర్నమెంటులో భాగంగా ఆడిన ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్‌లో ఎర్రం ప్రభాకర్ జట్టు విజయం సాధించగా, ట్రోఫీ అందించారు. కార్యక్రమంలో ఓఎంఎస్‌సీ క్లబ్ గౌరవ అధ్యక్షుడు, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు తూముల నరేశ్, క్లబ్ అధ్యక్షుడు బొలిశెట్టి కిషన్, కార్యదర్శి ఎర్రం ప్రభాకర్, ఉపాధ్యక్షులు తూముల ప్రభాకర్, సింగిల్ విండో డైరక్టర్ తూముల వెంకటేశ్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చిట్ల సత్యనారాయణ, టోర్నమెంట్ ఆర్గనైజర్లు పాల్గొన్నారు.

అట్టహాసంగా పీఎస్సార్ కరాటే పోటీలు



విజేతలతో ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని పద్మనాయక ఫంక్షన్‌హాల్‌లో పీఎస్సార్ కరాటే కప్ చాంపియన్‌షిప్ పోటీలు ఆదివారం నిర్వహించారు. మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు పోటీలను ప్రారంభించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన క్రీడాకారులు ఇందులో పాల్గొన్నారు. ఆదివారం రాత్రి వరకు పోటీలు కొనసాగాయి. కార్యక్రమంలో టోర్నమెంట్ చీఫ్ ఆర్గనైజర్ ఎం.నాగలక్ష్మి, ఎం.సరీశ్, అడ్వైజర్ ఎం.శ్రీధర్ పాల్గొన్నారు.

ఓవరాల్ చాంపియన్ మంచిర్యాల

మంచిర్యాల ఎమ్మెల్యే తన తండ్రి కొక్కిరాల రఘుపతిరావు మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించిన కరాటే పోటీల్లో 8 రాష్ట్రాల నుంచి 1,200 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. సీనియర్ గ్రాండ్ చాంపియన్‌షిప్ మంచిర్యాలకు, ఓవరాల్ ట్రోఫీ మంచిర్యాలకు వచ్చినట్లు నిర్వాహకులు తెలిపారు. గ్రాండ్ చాంపియన్‌షిప్ కప్ అండర్ 14 విభాగంలో కరీంనగర్‌కు చెందిన అబ్దుల్, వేములవాడకు చెందిన అఫ్సర్‌లు విజేతలుగా నిలవగా, బాలికల విభాగంలో నిహారిక విజయం సాధించింది. 14 ఏళ్లు పైబడిన బాలికల విభాగంలో కరీంనగర్‌కు చెందిన పి. శ్రీనిధి, బాలుర విభాగంలో మంచిర్యాలకు చెందిన పి. వెంకటేశ్, బ్లాక్ బెల్ట్ చాంపియన్‌షిప్‌లో కే. సుదీశ్ విజేతగా నిలిచారు.

కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- జేబీసీసీఐ సభ్యులు కొత్తకాపు లక్ష్మారెడ్డి వెల్లడి



సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మారెడ్డి

భీమారం: సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో జైపూర్‌లో నడుస్తున్న పవర్ ప్లాంట్‌లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం యాజమాన్యం పట్టించుకోవడం లేదని బీసీసీఐ సభ్యులు కొత్తకాపు లక్ష్మారెడ్డి తెలిపారు. ఆదివారం జైపూర్ మండల కేంద్రంలో సింగరేణి థర్మల్‌పవర్ ప్లాంట్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అండ్ ప్రొటెక్షన్ యూనియన్ సాధారణ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ మేరకు మాట్లాడుతూ జైపూర్ పవర్‌ప్లాంట్ కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో ఉదాసీనత వైఖరి మార్చుకోవాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్ కార్మికులకు హైపవర్గం వేతనాలు అమలు చేయాలన్నారు. అదేవిధంగా నాన్ టెక్నికల్ డిప్లొమా హోల్డర్స్ వివిధ విభాగాల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు శ్రమకు తగిన వేతనం కల్పించాలని డిమాండ్ చేశారు. సింగరేణి యాజమాన్యం జీతభత్యాలు అలవెన్సులు, కార్మికుల సంక్షేమం కూడా అమలు చేయాలని డిమాండ్ చేశారు. పవర్ ప్లాంట్ ప్రధాన కార్యదర్శి దుస్స భాస్కర్ పాల్గొన్నారు.

ఏఐటీయూసీ డివిజన్ కమిటీఎన్నిక

మందమర్రిరూరల్: సింగరేణి కాలరీస్ కోల్ టాన్స్‌పోర్ట్ వర్కర్స్ అండ్ డ్రైవర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) మందమర్రి డివిజన్ కమిటీని ఆదివారం ఏరియాలోని ఏఐటీయూసీ ఆఫీస్‌లో ఎన్నుకున్నారు. సంఘం బెల్లంపల్లి రీజియన్ గౌరవాధ్యక్షుడు రామడుగు లక్ష్మణ్ ఆధ్వర్యంలో ఎన్నిక జరిగింది. డివిజన్ గౌరవాధ్యక్షుడిగా భీమనాధుని సుదర్శన్, అధ్యక్షుడిగా ఈర్ల రవి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బబ్బెర కుమార్, ఉపాధ్యక్షులుగా అంకుష్, పల్లె కుమార్, ప్రధాన కార్యదర్శిగా నీరటి శ్రీశైలం, సహాయ కార్యదర్శులుగా తిరుపతి, బేతి రమేష్, ఆర్గనైజింగ్ సెక్రెటరీలుగా బబ్బెర నర్సింగ్, బబ్బెర రవి, కోశాధికారిగా గుర్రపు రాజేశంలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఉరేసుకుని వివాహిత ఆత్మహత్య

రామకృష్ణాపూర్: ఉరేసుకుని వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలోని భగత్ సింగ్‌నగర్‌లో చోటుచేసుకుంది. ఎస్సై రాజశేఖర్ వివరాల ప్రకారం... నీరటి రమాదేవి (36) భర్త సింగరేణి ఉద్యోగి కాగా వీరికి ఇద్దరు సంతానం. శనివారం సాయంత్రం ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. గమనించి అత్త స్థానికుల సాయంతో కిందకుదింపి ఏరియా ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. మృతికి గల కారణాలు ఇంకా తెలియరాలేదు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.